ఈత.. ఆరోగ్య ప్రదాత


స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న దృశ్యం


రూ.37 లక్షలతో గత ఏడాది నిర్మించిన బేబీ స్విమ్మింగ్ పూల్ (ఫైల్)

- ప్రజలకు పెరుగుతున్న ఆసక్తి
- మానసిక ఒత్తిడి దూరం

ప్రకాశం నగర్: ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి. ఆధునిక కాలంలో కష్టించే అవసరం లేకపోవడంతో మనకు తెలియకుండానే అనారోగ్యాల బారిన పడుతున్నాం. ముఖ్యంగా అధిక బరువు, పొట్ట వంటి సమస్యలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా నడక, పరుగు కనీస వ్యాయామాలుగా చెప్పవచ్చు. అయితే అందరికీ మేలు చేసే తేలికపాటి వ్యాయమంగా ఈత (స్విమ్మింగ్)ను భావించవచ్చు. దీనిపై జనం ఇటీవల మొగ్గుచూపుతున్నారు. అధిక బరువుతో నడక, పరుగు చేయలేని వారికి, మోకాళ్ల నొప్పులున్న వారికి ఈత ఒక మంచి సాధనంగా మారింది.స్విమ్మింగ్ చేయడం వల్ల భుజాలు, వెన్ను, కాళ్లు, పొట్ట వంటి అన్ని కండరాలకు మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రూ.37 లక్షలతో బేబీ స్విమింగ్ పూల్

నగరంలోని పుష్కరాల రేవులో గోదావరి స్విమ్మర్స్ క్లబ్, రివర్ పూల్, స్పోర్ట్స్ క్లబ్, ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్, రివర్ బే, స్నూకర్స్ జోన్ వంటి స్విమ్మింగ్ పూల్‌లు నగరవాసులకు అందుబాటులో ఉన్నాయి. స్థానిక 8వ డివిజన్‌లో సుమారు రూ.37 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో జిల్లాలో మెట్టమొదటి చిన్నారుల స్విమ్మింగ్ పూల్, డ్రెసింగ్ రూమ్‌లను గత ఏడాది ఎంపీ మార్గాని భరత్ రామ్, ఇతర అధికారులు ప్రారంభించారు.

మానసిక ఒత్తిడి దూరం

ఈతపై అభిరుచి ఉన్న చిన్నారులకు ఉదయం సాయంత్రం వేళల్లో నాలుగు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారని కోచ్‌లు చెబుతున్నారు. ఈత నేర్చుకున్న వారిలో మానసిక ఒత్తిడి తగ్గి చదువుల్లో ఉత్సాహంగా రాణించగలుగుతారన్నారు. గోదావరి స్విమర్స్ క్లబ్ సభ్యులు జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు.

> **పెరిగిన ఆసక్తి**
>
> గతంతో పోల్చిస్తే ఇప్పుడు స్విమ్మింగ్‌పై జనం బాగా ఆసక్తి చూపుతున్నారు. బీపీ, సుగర్,అధిక బరువు, కీళ్ల నొప్పులు ఉన్నవారికి ఈత మంచి వ్యాయామం. వేసవిలో ఈత నేర్చుకునేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతారు.
>
> – వెల్లమశెట్టి రాజు, స్విమర్

వైద్య విద్యార్థులకు కుటుంబాల దత్తత

- ఒక్కొక్కరికీ ఐదు చొప్పన కేటాయింపు
- ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి


కుటుంబాల దత్తత కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

కంబాలచెరువు: వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఫ్యామిలీ అడాప్షన్ (కుటుంబ దత్తత) కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. విద్యార్థులకు సమాజాన్ని పరిచయం చేయడం, అక్కడ నెలకొన్న వివిధ ఆరోగ్య పరిస్థితులు, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.శివప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఫ్యామిలి అడాప్షన్ కార్యక్రమం జరుగుతోంది. ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమకు కేటాయించిన కుటుంబాలతో మాట్లాడి, వారి ఆహార, ఆర్థిక, ఆరోగ్య, సామాజిక స్థితిగతులను సేకరించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రజల ఆరోగ్య అవసరాలు తెలుసుకొని వారిని చైతన్యం చేయాలన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ వీవీ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్నమాచారి రోడ్, దుర్గా నగర్, వాంబే కాలనీల పరిధిలోని కుటుంబాలను విద్యార్థులకు (ఒక్కొక్కరికి 5 చొప్పున) కేటాయింపు జరుగుతుందన్నారు. సమన్వయ అధికారి డాక్టర్ సురేంద్ర బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణి మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సూర్యా రావు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగి మృతి


వీరబాబు (ఫైల్)

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సబ్ ఆర్డినేటర్ ఏ.వీరబాబు (48) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన వీరబాబుకు భార్యతో పాటు పాప, బాబు ఉన్నారు. వీరబాబు మృతికి మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్య ప్రసాద్, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, మండల పరిషత్ ఏవో కె.చంద్రరావు, ఈవోపీఆర్డీ విక్టర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ దాస్, జూనియర్ అసిస్టెంట్ విజయ్ తదితరులు సంతాపం తెలిపారు.

వారసత్వ సంపద పరిరక్షణ మనందరి బాధ్యత


కృష్ణకుమార్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని వారసత్వ సంపదను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ ఆర్గనైజర్, గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. పేపర్‌మిల్లు సమీపంలోని శ్రీ కృష్ణసాయి కల్యాణ మండపంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ స్థాపించిన కొద్ది కాలంలోనే మంచి విజయాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఆనం కళాకేంద్రాన్ని సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులకు రూ.10 వేల అద్దెకు కేటాయించడంతో పాటు సుబ్రహ్మణ్య మైదానంలో ప్రదర్శిస్తున్న చిత్రాల్లో నగర చారిత్రాక నేపథ్యంపై డాక్యుమెంటరీ ప్రదర్శించడం జరుగుతుందన్నారు. దీనితో పాటు కమిటీ ప్రతిపాదించిన 11 అంశాలపై కమిషనర్ దినేష్ కుమార్ సానుకూల స్పందన తెలిపారన్నారు. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, నేదునూరి గంగాధరం గ్రంథాలయం, గౌతమీ గ్రంథాయాల్లో చాలా చారిత్రక సంపద, విలువైన చిత్రాలు ఉన్నాయన్నారు. వాటిని తిలకించేందుకు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల ద్వారా రెండు బస్సులు సమకూర్చుతామని, స్కూల్ యజమాన్యాలు తమను సంప్రదిస్తే వారికి తేదీని కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం తెలుగు భాషా సేవారత్న పురస్కారం గ్రహీత కమిటీ కన్వీనర్ వీఎస్ఎస్ కృష్ణ కుమార్‌కు దుశ్శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు కర్రి రామారెడ్డి, కేకే సంజీవరావు, ఎల్‌వీ ప్రసాద్, నెల్లి అప్పారావు, సిరి అప్పారావు, ఎస్‌వీవీ రెడ్డి, దేశిరెడ్డి బలరాం నాయుడు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా రూరల్ నియోజకవర్గం

- ఉత్సాహంగా స్వచ్ఛతా కార్యక్రమాలు
- మంత్రి వేణు


కోలమూరులో అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిలా రూరల్ నియోజకవర్గంలో స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, పార్టీ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం ఉదయం మండలంలోని కోలమూరు, కొంతమూరు, రాయుడుపాకలు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీలు, పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

డ్రైనేజీల పటిష్టతకు చర్యలు

మంత్రి వేణు మాట్లాడుతూ రూరల్ మండలంలో గడిచిన ఐదేళ్లలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనందున 15వ ఫైనాన్స్ సంఘం నిధులు లేమితో స్వచ్ఛతా లోపం కనబడుతోందన్నారు. సమర్థ నాయకత్వం ద్వారా దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, నియోజకవర్గ నాయకులు ఎంతో బాధ్యతగా, స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నారన్నారు. కోలమూరు, కొంతమూరు, రాయుడుపాకలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. రాయుడుపాకలు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన మంత్రి వేణుగోపాలకృష్ణ.. ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెంచుకాలనీలో సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ బాబూరావు, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉపసర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పడాల వీరప్రసాద్, షేక్ చానా, ఆనెం శ్రీను, ఆనందరావు, పరిమి దుర్గారావు, మెల్లిమి గాబ్రియేలు, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, వాకపల్లి సుదర్శనరావు, తీటి ప్రసాద్, సోమిరెడ్డి సత్తిబాబు, పిల్లి సూర్యారావు, ఉల్లింగి నవీన్, షేక్ బాబ్జీ, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు


లేపాక్షి ఎంపోరియంలో చైర్ పర్సన్ విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: చేతివృత్తి కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, అండగా నిలుస్తోందని ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడిగించల చంద్రమౌళితో కలిసి శుక్రవారం రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 20 లేపాక్షి ఎంపోరియం శాఖల ద్వారా హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులను విక్రయించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా హస్తకళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారన్నారు. కళాకారులకు అవార్డుతో పాటు రూ.10 లక్షల పారితోషకం అందించారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం మేనేజర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

యువరైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి

- సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్
- రైతులకు అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్

రాజమహేంద్రవరం రూరల్: యువరైతులు అంకుర సంస్థలుగా డిస్టిలేషన్ యూనిట్లను స్థాపించుకుని సుగంధ తైలాలను మార్కెటింగ్ చేసుకునేందుకు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమెటిక్ ప్లాంట్స్ (సీఐఎంఏపీ), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. ఔషధ, సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, విలువ జోడింపు, మార్కెటింగ్ అంశాలపై హైదరాబాద్ సీఎస్ఐఆర్ అండ్ సీఐఎంఏపీ ప్రాంతీయ పరిశోధనా స్థానం, సీఎస్ఐఆర్అండ్ సీఐఎంఏపీ, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో శుక్రవారం స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు సుగంధ, ఔషధ మొక్కలపై అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. అనంతరం సుగంధ ఔషధ మొక్కల వివరాలను తెలిపే పోస్టర్లు, నిమ్మగడ్డి రూట్ కటింగ్స్, పామరోజా విత్తనం, సుగంధ తైలాలు, అశ్వగంధ విత్తనం శాంపిల్ కిట్లను రైతులకు ఉచితంగా అందించారు. కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జె.కౌటేష్ కుమార్ మాట్లాడుతూ నిమ్మగడ్డి, కాశ గడ్డి, కామాక్షి కసువు, వట్టివేరు, యూకలిప్టస్, తులసి, పచౌలి, కలబంద వంటి సుగంధ, ఔషధ పంటల సాగు వివరాలను, వాటి ఔషధ గుణాల నాణ్యత, నర్సరీ పెంపకం అంశాలను రైతులకు వివరించారు. కృషివిజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, చీఫ్ శాస్త్రవేత్త జీడీ కిరణ్ బాబు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కేవీఎస్ సత్య శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. గండేపల్లి గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు నరేంద్రబాబు ఈ రైతు సదస్సును నిర్వహించడానికి సహకరించారు. సదస్సులో వివిధ మండలాల అభ్యుదయ రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో వివరాల సేకరణ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

ప్రకాశం నగర్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది, డేటా నమోదు, పోలీసులు, భద్రతా దళాలు, మానవ వనరుల గుర్తింపుపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, డీఆర్వో జి.నరసింహులు, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఓటరు జాబితా అనంతరం ఫారం 6, 7, 8 పురోగతి తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు దరఖాస్తులను పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లు, కమిషనింగ్ రూమ్‌లు, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలను అధ్యయనం చేశామన్నారు. ఇప్పటికే బీఎల్‌వో నుంచి మాస్టర్ ట్రైనర్ల వరకూ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఎస్పీ పి.జగదీష్ భద్రత చర్యలపై నివేదిక అందజేశారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను గత ఎన్నికల నేపథ్యంలో గుర్తించడం జరిగిందన్నారు.

సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయాలి

కంబాలచెరువు: క్షేత్ర స్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగు పరచుకుని, సమస్యలు సృష్టించే వ్యక్తులను ముందస్తుగా గుర్తించి బైండోవర్ చేయాలని పోలీసు అధికారులు ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల నియమావళిపై జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జిల్లాలోని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, హోంగార్డులకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో ఎన్నికలపై శిక్షణ పొందిన రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాస్, దేవరపల్లి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఆయా స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, రాతపూర్వకంగా నివేదిక సమర్పించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి ధ్వంసం చేసిన ఘటనలు, ఎలక్షన్ అధికారులపై దాడులకు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు. ఏకపక్షంగా ఎన్నికలు జరిగిన ప్రదేశాలు, ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి, ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసిన ఘటనలను కూడా గుర్తించాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో ఆ గ్రామ పెద్దలతో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, సారా, మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ వర్క్‌షాప్‌లో 350 మందికి పైగా కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు


స్వామివారికి అభిషేకం


బొమ్మూరులో శాంతికల్యాణం నిర్వహిస్తున్న సోమనాథశర్మ, సత్యనారాయణ

సీటీఆర్ఐ: రథసప్తమి మహా పర్వదినం సందర్భంగా ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవాలయంలోని ఉషా ఛాయా పద్మినీ సమేత సూర్యనారాయణమూర్తికి శుక్రవారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచి విశేష అభిషేకాలు, తులసీ అర్చన, సూర్య నమస్కారాలు, స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి నీలకంఠ శర్మ, దెందులూరి సుబ్రహ్మణ్యం సీతారామస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆర్.శ్రీనివాసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. గోదావరి గట్టున గల అక్షర పీఠంలో సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలోని సూర్యమందిరంలో రథసప్తమి వేడుకలు, సూర్యనారాయణమూర్తి జయంతిని వైభవంగా నిర్వహించారు. రాజవోలు గాయత్రీ నగర్‌కు చెందిన చిట్టెళ్ల కాశీపతి సోమనాథశర్మ, పద్మావతి దంపతులు, అప్పలి సత్యనారాయణ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం నిర్వహించారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగిశాయి. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో వల్లూరి సూర్యనారాయణశర్మ, కాళ్లకూరి శ్రీరామశర్మ అర్చక బృందం బ్రహ్మత్వం నిర్వహించారు. వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రం అధ్యక్షుడు ఓలేటి సత్యనారాయణ, సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. గంటా సురేష్, సోమనతోట వారి యూత్ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించారు.

ప్రమాద బీమా అందజేత

ప్రకాశం నగర్: ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు (సభ్యుడు)భూపతిరాజు సత్యనారాయణరాజు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన నామినికి బ్యాంకు చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఎన్.తేజ్ భరత్ శుక్రవారం రూ.లక్ష ప్రమాదం బీమా పాలసీ చెక్కును అందజేశారు. అంతకు ముందు బ్యాంకు బ్రాంచీల హెడ్‌లతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించిన తేజ్ భరత్ మాట్లాడుతూ త్వరితగతిన బకాయిలు వసూలు చేసి, వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహకార ఆడిట్ అధికారి ఎం.జగన్నాథరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు, బ్యాంకు సెక్రటరీ కె.స్వరాజ్యలక్ష్మి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సేల్ ఆఫీసర్ రాధాశివకుమార్ పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

కంబాలచెరువు: ఈ నెల 27న జరిగే చలో విజయవాడకు ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ ఎత్తున తరలి రావాలని ఏపీ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో హోంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 14 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 17న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: వేమగిరి ఇండస్ట్రియల్, కడియం, కడియపుసావరం, జేగురుపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ శ్రీధర్‌వర్మ తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా కలిగే ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

క్లుప్తంగా

పిడింగొయ్యిలో వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి సచివాలయం-1లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 507 మంది వైద్యసేవలు పొందారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు జి.రోహిత, ఆర్థోపెడిషియన్ పవన్, ఎమర్జెన్సీస్పెషలిస్ట్ కె.నాగేశ్వరరావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్య వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 4న ఎలక్ట్రికల్ కార్మికులకు సెలవు

సీటీఆర్ఐ: ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రతినెలా 4వ తేదీన సెలవు రోజుగా ప్రకటించామని, దానిని అందరూ తప్పకుండా పాటించాలని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి ఆశపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక విక్రమహాల్‌లో శుక్రవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో తేదీన సెలవు రోజుగా పాటించడం జరుగుతుందని, ఆ రోజు అత్యవసరంగా పని చేయాలంటే మూడో తేదీన అనుమతి తీసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ పనుల ధరల వివరాలను త్వరలో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎడ్ల సూర్యచంద్రరావు, గౌరవ సలహాదారులు కాకి రవిబాబు, ఉపాధ్యక్షుడు ఆచారి పాలొన్నారు.

బీజేపీ కూటమిని గద్దె దింపాలి

ప్రకాశం నగర్: కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న బీజేపీ కూటమిని గద్దె దింపాలని కార్మికులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ శుక్రవారం కోటిపల్లి బస్టాండ్ వద్దగల హెడ్ పోస్టాఫసు నుంచి శ్యామల సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కోటగుమ్మం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఏవీ రమణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచిపెట్టారని ఆరోపించారు. రైతు చట్టాల పేరుతో భూములను కార్పొరేట్లకు దోచి పెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. దేశంలో 80 శాతం ఉన్న పేద ప్రజలపై పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలు, విద్యుత్ చార్జీల పెంపుతో పెనుభారం మోపారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, నాయకులు వి.రాంబాబు, అప్పల నరసయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కడియం: ఉత్సవాలు, ఊరేగింపుల్లో ఎటువంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ కోరారు. ఈ నెల 18, 19 తేదీల్లో కడియపులంకలో కుంతీదేవి అమ్మవారి జాతర సందర్భంగా స్థానికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కడియం: జేగురుపాడు శివాలయం వీధిలో సారా అమ్ముతున్న జనిపల్లి సత్యవతిని అరెస్టు చేసి, ఆమె నుంచి ఐదులీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. మండల పరిధిలో కోడిపందాలు, పేకాట, సారా, అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారాను అదుపు చేయడంలో ప్రజలు సహకరించాలని కోరారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ప్రకాశం నగర్: రైళ్లలో దొంగతనాలు చేసే విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన గొర్లె రంగారావును గోదావరి రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసినట్టు జీఆర్‌పీ ఎస్సై పి.లోవరాజు శుక్రవారం తెలిపారు. అతడి నుంచి రూ.1.65 లక్షల విలువైన ఫోన్‌ను రికవరీ చేశామన్నారు. నిందితుడిని విజయవాడ కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించామన్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, శివ, రామారావు, ఆర్‌పీఎఫ్ సిబ్బందిని రైల్వే డీఎస్పీ ఎల్.మోహనరావు అభినందించారన్నారు.

సినిమాలు

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యమినీ	: మేడమ్ వెబ్
సూర్యప్యాలెస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండు
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	: యాత్ర-2
రంభ	: లాల్‌సలామ్
మేనక	: సూర్య సన్ ఆఫ్ కృష్ణన్, డ్రిల్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: ట్రూ లవర్
నామవరం	
వీఎస్ మహల్	: ఊరుపేరు భైరవకోన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఊరుపేరు భైరవకోన
కడియం	
వెంకట సూర్య	: ఊరుపేరు భైరవకోన